సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM

# చెన్నైలో మౌళి-ఏ టైమ్‌లెస్ ట్రెడిషన్ నృత్య రూపకం



బాలాదేవి చంద్రశేఖర్

సాక్షి, చెన్నై: అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన భరతనాట్య విద్వాంసురాలు, పరిశోధకురాలు బాలాదేవి చంద్రశేఖర్ తమ ప్రతిష్టాత్మక నృత్య రూపకం మౌళి - ఏ టైమ్‌లెస్ ట్రెడిషన్‌ను ఆగస్టు 2న చెన్నైలో ప్రదర్శించనున్నారు. ఇందుకు వేదికగా తిరువాన్మియూర్‌లోని భరతకళాక్షేత్ర ఆడిటోరియాన్ని ఎంపిక చేశామని నిర్వాహకులు ప్రకటించారు. బాలాదేవి చంద్రశేఖర్ స్వీయ రచన, కొరియోగ్రఫీలో రూపొందిన మౌళి ప్రదర్శన పండరీపూర్ ఆధ్యాత్మిక వారసత్వం, వార్కరీ సంప్రదాయాల నేపథ్యంతో సాగే ఒక సుదీర్ఘ పరిశోధనాత్మక భరతనాట్య రూపకం అని వివరించారు. భక్తి, సమత్వం, కరుణ, మాతృత్వపు ప్రాముఖ్యతను చాటిచెప్పే ఈ రూపకం ప్రేక్షకులను పండరీపూర్ క్షేత్ర తీర్థయాత్ర అనుభూతిలోకి తీసుకెళ్తుందన్నారు. భరతనాట్యం, సంగీతం, సాహి త్యం కథాకథనాల సమన్వయంతో సాగే ఈ ప్రదర్శన ఆధ్యాత్మికతకు సరిహద్దులు లేవనే సందేశాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలా దేవి చంద్రశేఖర్ మాట్లాడుతూ భరతనాట్యం ద్వారా సమానత్వం, కరుణ ఆధ్యాత్మిక సమత్వాల అమూల్యమైన విలువలను నేటి తరానికి అందించడమే తన ఉద్దేశంగా ప్రకటించారు. ఆగస్టు 2న భరతకళాక్షేత్ర ఆడిటోరియం వేదికగా జరిగే ఈ ప్రదర్శనకు అందరికీ ఉచిత ప్రవేశం కల్పించామన్నారు.